భవనాలపై నిర్లక్ష్యపు నీడలు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ భవన నిర్మాణాలు
- ఎన్నికలు రావడంతో ఆగిపోయిన పనులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోని వైనం
- రూ.కోట్లలో ప్రజాధనం వృథా




పునాదుల దశలో ఆగిపోయిన పెద్దకడబూరు సచివాలయ భవనం చుట్టూ ముళ్ల పొదలు పెరిగిన దృశ్యం, పీకలబెట్ట గ్రామంలో అర్థంతరంగా ఆగిపోయిన సచివాలయ భవనం

పెద్దకడబూరు: సంక్షేమ పథకాలు సకాలంలో ప్రజలకు అందించడమే కాకుండా ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరికీ అందించాలన్న ముఖ్య ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. మండలంలో చాలా వరకు సచివాలయ భవనాలు పూర్తయ్యి కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అయితే ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో కొన్నిచోట్ల సచివాలయ భవనాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఆయా భవనాలు పూర్తి చేయడంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకోవడంతో లక్షల్లో ప్రజా ధనం వృథా అవుతోంది.

మండలంలో 18 సచివాలయాలు..

మండల పరిధిలో 18 సచివాలయాలను ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడం కోసం గత ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతోపాటు 18 సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాలను సైతం మంజూరు చేసింది. అయితే వాటిలో 6 గ్రామ సచివాలయాలకు సంబంధించి భవనాల నిర్మాణం పూర్తి కావడంతో వాటిని ప్రారంభించగా అందులోనే సేవలను కొనసాగిస్తున్నారు. మిగిలిన 12గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు వివిధ దశల్లో పనులు ఆగిపోయాయి. గతేడాది సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో పనులు నిలిచిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా ఇప్పటి వరకు అసంపూర్తిగా ఉన్న భవనాల గురించి ఏమాత్రం ఆలోచన చేయడం లేదు. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణ దశలో ఆగిపోయిన భవనాల పరిస్థితి ఏమిటని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

అసంపూర్తిగా గ్రామ సచివాలయ భవనాలు

మండలంలో పెద్దకడబూరు – 1, కంబదహాల్, హనుమాపురం, కంబలదిన్ని, నాగులాపురం, దొడ్డిమేకల సచివాలయాల భవనాలు పూర్తి అయ్యి వాడుకలోకి వచ్చాయి. పెద్దకడబూరు – 2, పీకలబెట్ట, నౌలేకల్లు, కల్లుకుంట, జాలవాడి, చిన్నతుంబళం, గవిగట్టు, బసలదొడ్డి, మేకడోణ, తారాపురం, హెచ్.మురవణి –1, హెచ్.మురవణి – 2 సచివాలయ భవాలు అసంపూర్తిగా మధ్యలోనే నిలిచిపోయాయి.

నిర్వీర్యం చేసే కుట్ర

సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందించాలనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు మంచి చేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ లక్ష్యం నీరుగారిపోతోంది. దేశవ్యాప్తంగా మన్ననలు పొందిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. ప్రజలకు అందించే సేవలను కుదించడమే కాకుండా సిబ్బందిని సైతం తగ్గించడంతో సేవలపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి.



కల్లుకుంటలో నిర్మాణ దశలో ఆగిపోయిన సచివాలయ భవనం

వాడుకలోకి తేవాలి



లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వినియోగించి నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలను ప్రజా అవసరాలకు వినియోగించాలి. అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయకపోవడంతో ప్రజలు చాలా నష్టపోతారు. ప్రభుత్వం ఏదైనా కావచ్చు. కానీ ప్రభుత్వం ద్వారా నిర్మించిన భవనాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. అభివృద్ధి పనుల్లో రాజకీయం చేయడం సరికాదు.

– భాస్కర్‌యాదవ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ప్రజా ధనం వృథా చేయడం భావ్యం కాదు



సచివాలయ భవనాలు నిర్మాణం దశలోనే ఇలా పట్టించుకోకుండా వదిలేయడం ప్రజా ధనం వృథా చేయడమే అవుతోంది. ఒక్కో భవనానికి లక్షల్లో డబ్బులు వెచ్చించి ఇలా నిర్మాణ దశలోనే వదిలివేస్తే ప్రజలే నష్టపోయేది. రాజకీయ నాయకుల సొమ్మేమి పోదు. నష్టపోయేది ఒక పేదోళ్ల మాత్రమే. ఇప్పటికైనా నిర్మాణ దశలో ఉన్న భవనాలను పూర్తిచేసి అందుబాటులోకి తెస్తే ప్రజలకు ఉపయోగపడుతుంది.

–వీరేష్, సీపీఐ మండల కార్యదర్శి

క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన ఆర్‌అండ్‌బీ ఈఈ



సబ్‌కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఆర్‌అండ్‌బీ ఈఈ డి.పద్మనాభరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ

ఆదోని రూరల్: ఆదోని ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.పద్మనాభరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నెలకొన్న రోడ్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు.

మున్సిపల్ ఇంజినీర్‌గా సత్యనారాయణ

ఆదోని మున్సిపల్ ఇంజినీర్‌గా సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

బస్టాండ్‌లో శౌచాలయాలు ప్రారంభం

మంత్రాలయం రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన శౌచాలయాల సముదాయాన్ని గురువారం ఎమ్మిగనూరు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. మంత్రాలయం విచ్చేయు భక్తుల సౌకర్యార్థం మహిళలు, పురుషులకు వేర్వేరు విభాగాలుగా గదులు ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరుకు చెందిన వెంకటేశ్వర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో టాయిలెట్ల నిర్వహణ ఉంటుందన్నారు. సొసైటీ నెలనెలా డిపోకు రూ.18,500 చొప్పున బాడుగ చెల్లించాలని నిశ్చయించారు. ప్రారంభోత్సవంలో టీఐ యల్లప్ప, మెంటెనెన్స్ నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని ఆదోని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. గురువారం ఆదోని పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు బాగా చదువుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మాదక ద్రవ్యాలైన గుట్కా, సిగరెట్లు, గంజాయి, డ్రగ్స్, సారా వంటివాటి జోలికెళ్లవద్దన్నారు.

యురియాను పక్కదారి పట్టించినా పట్టించుకోవడంలేదు

ఎమ్మిగనూరుటౌన్: స్వయాన వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మనే రైతులకు సబ్సిడీపై దక్కాల్సిన యూరియాను పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్, ఏపీ రైతు కూలీసంఘ కార్యదర్శి ఏసేపు ఆరోపించారు. అలాంటి అధికారులకు రైతులకు అవసరమైన యూరియాను ఎలా పంపిణీ చేయగలరని ప్రశ్నించారు. గురువారం స్థానిక రైతు కూలీ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో వ్యాపారస్తులంతా సిండికేట్ అయి యూరియాను ఎరువులను అధిక ధరలకు విక్రయించుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియా మంజురు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కిష్టన్న, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాలలో ధూమ, మద్యపానం నిషేధం



పాఠశాల ఆవరణలో బంకు యజమానికి జరిమానా విధిస్తున్న ఎస్‌ఐ ఎం. కేశవ

నందవరం : బహిరంగ ప్రదేశాలలో ధూమపానం, మద్యపానం నిషేధమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎం. కేశవ హెచ్చరించారు. అలాగే పాఠశాలల ఆవరణలో సిగరెట్లు, బీడీలు, గుట్కాలు విక్రయించరాదని సూచించారు. గురువారం మండలకేంద్రంలో ఎంపీపీ స్పెషల్ స్కూల్ ఆవరణలోని షాపులను పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో ఎస్‌ఐ తనిఖీ చేశారు. సిగరెట్లు, బీడీలు, గుట్కాలు విక్రయిస్తున్న 11 మంది షాపు యజమానులకు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల ఆవరణలో మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ కోదండ రామిరెడ్డి, కానిస్టేబుల్ గోవిందరాజులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని కలిసిన మహిళా విభాగం అధ్యక్షురాలు నాడుగేని భీమక్క

కోసిగి: మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు నాడుగేని భీమక్క, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు సన్నక్కి ప్రకాష్, ఐటీ విభాగం మండల అధ్యక్షుడు జంపాపురం గ్రామానికి చెందిన జి. శివశంకర్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పూలమాలలు వేసి సన్మానించారు. తమపై నమ్మకం ఉంచి పార్టీలో సముచిత స్థానం కల్పించడంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నాడుగేని నాగరాజు, నాడుగేని రాముడు, బండ్ల గోవిందు, వీరేష్, పంపారెడ్డి, తాయన్న, సుల్తాన్, శ్రీను, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి ఆదాయం పెంచాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

గోనెగండ్ల : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం పెంచాలని డీఎల్‌పీఓ తిమ్మక్క అన్నారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో 5 నుంచి 10 మంది గ్రామస్తులకు చెత్త సేకరణ మీ గ్రామంలో సక్రమంగా జరుగుతుందా లేదా అని విజయవాడ నుంచి ఫోన్‌లు వస్తాయని, వాటిని రిసివ్ చేసుకొని సమాధానం చెప్పాలన్నారు. గ్రామంలో సేకరించిన చెత్త ద్వారా వానపాములతో సేంద్రియ ఎరువులు తయారు చేసి అమ్మకాలు జరుపుతున్నారని తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో తయారి చేసిన సేంద్రియ ఎరువులను రైతులు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నందవరం ఈఓఆర్డీ సందీప్, గోనెగండ్ల ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి, సిబ్బంది మలాంగ్, అనిల్, సుభాన్ పాల్గొన్నారు.

త్వరలోనే సాగునీరు అందిస్తాం



ఎల్‌ఎల్‌సీ నీటికి గంగపూజ నిర్వహిస్తున్న ఇరిగేషన్ డీఈ నారాయణ, సిబ్బంది

పెద్దకడబూరు: ఎల్ఎల్‌సీ కింద ఉన్న ఆయకట్టు భూములకు త్వరలోనే సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ డీఈ నారాయణ తెలిపారు. తుంగభద్ర డ్యామ్ నుంచి విడుదలైన నీరు గురువారం పెద్దకడబూరు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో కలసి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి జల హారతి చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్యామ్‌లో నీరు పుష్కలంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతానికి ఈ కాలువ నీటిని తాగడానికి వాడుకోవాలన్నారు. త్వరలోనే సాగుకు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో జేఈ రామాంజినేయులు, సిబ్బంది ఓబులేసు, అంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని పారదోలుదాం

ఆదోని టౌన్: దేశం నుంచి క్షయవ్యాధిని పారదోలుదామని మెడికల్ ఆఫీసర్ త్రివేణి, సూపర్‌వైజర్ బాబురాజు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అరుణ్‌జ్యోతి నగర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, సుబ్బమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఆదోని అర్బన్: హొళగుంద మండలం సమ్మతగేరి గ్రామానికి చెందిన ఆంజనేయులు(79) అప్పుల బాధ, అనారోగ్యం కారణంగా గురువారం పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన మేరకు వివరాలు.. ఆంజనేయులుకు నాలుగు ఎకరాల భూమి ఉంది. పెట్టుబడులకు చేసిన అప్పులు ఎక్కువ కావడంతో పాటు అనారోగ్య సమస్యతో మనస్థాపానికి గురై గురువారం పట్టణశివారులోని ఇందిరమ్మ కాలనీ వద్ద పురుగులమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం.

డప్పు కళాకారుల పెన్షన్ నమోదు ప్రక్రియ ప్రారంభించాలి

గోనెగండ్ల: డప్పు కళాకారుల పెన్షన్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలో మండల అధ్యక్షుడు మారేష్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డప్పు కళాకారుల పెన్షన్ దరఖాస్తు వయసును 45 సంవత్సరాలకు తగ్గించడంతో పాటు పెన్షన్‌ను రూ.7వేలకు పెంచాలన్నారు. అలాగే ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డప్పు కళాకారులు గంజిహళ్లి బస్టాండ్ నుండి డప్పుల దరువులతో ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఎంపీడీఓ మణి మంజరికి వినతిపత్రం అందజేశారు.

మండల కమిటీ ఎన్నిక

డప్పు కళాకారుల నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష కార్యదర్శులుగా మాణిక్యం, జాన్, ఉపాధ్యక్షులుగా దస్తగిరి, నాగరాజు, సహాయ కార్యదర్శులుగా పెద్ద కర్రన్న, నాగార్జున, కమిటీ సభ్యులుగా గోరంట్ల, దస్తగిరి, చిన్న దేవన్న, రత్నమయ్య, ఏలియలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా శ్రీబెనకాగురువుల ఆరాధనోత్సవం



పూజలు అందుకుంటున్న బెనకాగురువులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో వెలసిన ఘనగురు దత్తాత్రేయ సంప్రదాయ వంశపారంపర్య గంజెళ్ల వెంకటాగురు శిష్యుడైన శ్రీబెనకాగురువుల 119వ ఆరాధన మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. గంజెళ్ల వెంకటాగురువుల వంశస్థులైన శ్రీ కృష్ణమూర్తి స్వామిలవారి అధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. రాత్రి గురుపూజ, మంగళహారతులు, తీర్థప్రసాద వితరణ, భజన కార్యక్రమములు చేపట్టారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం పుణ్యగణారాధన, పల్లకీసేవ, నందికోలసేవ అనంతరం గురువుల విచారణ ప్రవచనం, ప్రసాద, భోజన కార్యక్రమాలు ఉంటాయి. కార్యక్రమంలో మఠం రంగప్పస్వామి, మఠం శాంతమూర్తిస్వామి, మఠం బ్రహ్మేందస్వామి, భక్తబృందం పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని శ్రీ మార్కండేయ స్వామి ఆలయ కల్యాణ మండపంలో ఈనెల 19న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

యూరియా కొరత రానివ్వం

ఆదోని రూరల్: రైతులకు యూరియా రాని వ్వకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏఓ) సుధాకర్ తెలిపారు. గురువారం ఆదోని రైల్వే స్టేషన్‌కు పక్క రాష్ట్రాల నుంచి యూరియా వచ్చిందని చెప్పారు. రైల్వే వ్యాగన్‌ల ద్వారా 3001 మెట్రిక్ టన్నుల క్రిప్కో యూరియా వచ్చిందని, దీనిని లారీలలో రైతుసేవా కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

ఆదోని టౌన్: పట్టణంలోని నిర్మల్ టాకీసు, ఓవర్ బ్రిడ్జి సమీపంలోని అన్న క్యాంటీన్లను గురువారం ఆదోని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ పరిశీలించారు. అన్నా క్యాంటీన్లలో ప్రజలకు అందిస్తున్న భోజనాన్ని స్వయంగా తిని రుచి చూశారు. రికార్డులను తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని, అల్పాహారాన్ని అందించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

గోనెగండ్ల : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ మణి మంజరి, డాక్టర్ రంగ రవళి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఎల్‌హెచ్‌పీలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లోని ఎంఎల్‌హెచ్‌పీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ పరిధిలోని ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల అవసరం ఉంటే గోనెగండ్ల ఆస్పత్రికి రెఫర్ చేయాలన్నారు.

19న కారంచేడు అమరుల స్మారక సభ

ఎమ్మిగనూరుటౌన్: కారంచేడులో దళితుల నరమేధం జరిగి 40 ఏళ్ల అయిందని, అందులో మృతి చెందిన అమరుల స్మారకార్థం ఈనెల 19వ తేదీన ఎమ్మిగనూరులోని కుర్ణికల్యాణ మండపంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. ఈమేరకు గురువారం పట్టణంలో సదస్సు కరపత్రాలను ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సుకు మేధావులు, అణగారిన వర్గాలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు, నాయకులు ప్రతాప్, కిరణ్, పక్కీర్ సాహెబ్, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

ఒప్పందాలు అమలు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: సమ్మె కాలంలో ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులతో చేసుకున్న ఒప్పందాలను సత్వరం అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యునియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, నాగరాజు, సీఐ టీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నాయకులు కేశన్న, రాజు, ము నీంద్ర, నర్సోజి, మల్లికార్జున పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ


సాక్షి ఎఫెక్ట్



రైతులకు యూరియా పర్మిట్లు జారీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

నందవరం: మండల కేంద్రం నందవరంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో వ్యవసాయ అధికారులు, సొసైటీ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు గురువారం యూరియా పంపిణీ చేశారు. సాక్షి దినపత్రికలో గురువారం 'యూరియా అందక అన్నదాతల ఆందోళన' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు.. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) అధికారుల నేతృత్వంలో రైతులకు యూరియా అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈఓ సుదర్శనం మాట్లాడుతూ.. మండలంలోని సొసైటీ నుంచి 500 మంది రైతులకు 3 బస్తాల చొప్పున 1,500 బ్యాగుల యూరియా పంపిణీ చేశామని వివరించారు. అలాగే మండల పరిధిలోని ఇబ్రహీంపురం రైతు సేవ కేంద్రంలో 300 బస్తాలు, నాగలదిన్నె ఆర్ఎస్‌కేలో 300 బస్తాలు, నదికైరవాడి ఆర్ఎస్‌కేలో 300 బస్తాలు, సోమలగూడూరు-2 ఆర్ఎస్‌కే నుంచి 300 బస్తాల యూరియా రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, అందరికీ యూరియా అందుబాటులో ఉందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు శ్రీనివాసులు, రామలక్ష్మి, పార్వతి, వీహెచ్‌ఏ ఖాజా, వీఏఏ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా



ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి

ఎమ్మిగనూరురూరల్: సబ్ డివిజన్ పరిధిలోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, గోనెగండ్ల, నందవరం మండలాల్లోని రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల్లో యూరియా రైతులకు అందుబాటులో ఉందని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలానికి 1500 బస్తాలు, గోనెగండ్లకు 2400 బస్తాలు, మంత్రాలయంకు 1200 బస్తాలు యూరియా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. అలాగే నందవరం సహకార సొసైటీలో 1200 బస్తాలు, కైరవాడి సొసైటీలో 1500 బస్తాలు, కడిమెట్ల సొసైటీలో 1500 బస్తాల యూరియా పంపిణీ సిద్ధంగా ఉందని తెలిపారు. యూరియా అవసరం ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల దగ్గరకు పట్టాదార్ పాస్‌పుస్తకం తీసుకెళ్లాలని సూచించారు. అలాగే ఎరువుల దుకాణాల్లో వ్యాపారులు ఎంఆర్‌పీల కన్నా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాబు మోసాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరిద్దాం



మాట్లాడుతున్న మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, అలువాల ప్రమోద్ కుమార్ రెడ్డి

గోనెగండ్ల: ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ప్రతి కుటుంబం ఎంత నష్టపోతుందో ఇంటింటికీ వెళ్లి వివరిద్దామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, రాష్ట్ర బిజినెస్ వింగ్ సెక్రటరీ అలువాల ప్రమోద్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాల్సిన సమయం వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ హామీల పేరిట ఎన్నికల సమయంలో ఇంటింటికీ బాండ్లు పంపిణీ చేశారని, అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకపోతే నిలదీయండని చెప్పారన్నారు. సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి మన ప్రభుత్వం పేరిట వస్తున్న నాయకులను ప్రజలు బాండ్లు తీసుకుని నిలదీయాలన్నారు.


19న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

ఈనెల 19వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక హాజరవుతారని తెలిపారు. కాబట్టి మండలంలోని అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కాశీరెడ్డి, చికెన్ రాజా, ఎస్‌బీ మన్సూర్, దొరబాబు, నాయుడు, రాజా రెడ్డి, గంగాధర్, వల్లబుడు తదితరులు పాల్గొన్నారు.

20న ఉచిత వైద్య శిబిరం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలోని సంస్కృతి ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 20న ఉదయం 9 గంటలకు అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మరియు వామ్ (ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత రక్తనాళాల వైద్యశిబిరం, కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాకుబాళ్ నగేష్, అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. గురువారం వారు అందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ శిబిరంలో అర్హులైన వారికి రూ.4500 విలువ గల రక్తనాళాల పరీక్షలు, కన్సల్టింగ్ సర్వీసులు, అర్హులైన వారికి డాక్టర్ల సలహా మేరకు ఉచిత కంటి శుక్లం ఆపరేషన్లు, నంద్యాల శాంతిరాం ఆసుపత్రి, ఎన్‌టీఆర్ వైద్యసేవ సహకారంతో చేయడం జరుగుతుందన్నారు. ఆస్పత్రిలోనే వసతి, భోజనం, మందులు, రానుపోను రవాణా సౌకర్యం, రోగులకు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 73373 21810 (రక్త నాళాల క్యాంపుకు సంబంధించి), 99802 69662 (కంటి సమస్యలకు సంబంధించి) సంప్రదించవచ్చన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేయడమే నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ లక్ష్యమని అసోసియేషన్ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రాజేశ్వరి హోటల్‌లోని మీటింగ్ హాల్‌లో ఏపీఎస్ ఆర్టీసీ పీటీడీ ఎమ్మిగనూరు డిపో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో భాగంగా నేషనల్ మజ్దూర్ యునిటీ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా తిక్కారెడ్డి, కమిటీ ముఖ్యసలహాదారుడిగా వైఆర్ చంద్ర, డిపో అధ్యక్షుడిగా ఎస్ఎం రఫీక్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఎల్‌హెచ్ గంగన్న, డిపో కార్యదర్శిగా ముస్తాక్ అహమ్మద్, గ్యారేజీ అధ్యక్షుడిగా డీఎస్ఎస్ వలి, గ్యారేజీ కార్యదర్శిగా భాస్కర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్ఆర్ నాయుడు, రీజనల్ కార్యదర్శి పీఎండి ఇస్మాయిల్ తదితరులు ప్రసంగించారు.